

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 44 | శుక్రవారం 22, మే 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# మాదే పెద్ద బాధిత కుటుంబం

- మేమే ముగ్గురిని కోల్పోయాం
- క్రిమినల్స్ మేమా... మీరా?
- హత్యా రాజకీయాలు ఎవరివో చరిత్ర చెబుతోంది
- సీఎం చంద్రబాబునాయుడుపై వైఎస్ జగన్ ప్రశ్నల వర్షం



ఏపీ బ్యూరో (ప్రజాసీమ): తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. రాజకీయ విమర్శలకు మించి తన కుటుంబం ఎదుర్కొన్న విషాదాలను గుర్తు చేస్తూ "మాది బాధిత కుటుంబం" అంటూ గతం తవ్వుకొచ్చారు. మా తాత రాజారెడ్డిని చంపేశారు, మా నాన్న వైఎస్సార్ మరణం చుట్టూ ఇప్పటికీ అనేక అనుమానాలు ఉన్నాయి, మా బాబాయి వివేకానందరెడ్డి హత్యకు గురయ్యారు... ఇలా వరుసగా మనుషులను కోల్పోయిన కుటుంబం మాది. అలాంటి మా కుటుంబంపైనే క్రిమినల్స్ ముద్ర వేస్తారా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో బాధితులమైన మమ్మల్నే నిందితుల్లా చూపించే ప్రయత్నం జరుగుతోంది" అని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు అసెంబ్లీలో వైఎస్సార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల తర్వాత కొద్ది రోజుల్లోనే హెలికాప్టర్ ప్రమాదం జరగడాన్ని గుర్తు చేసిన జగన్, "ఆ ఘటనలన్నింటినీ ప్రజలు మర్చిపోలేదు" అన్నారు. తాత రాజారెడ్డి హత్య కేసులో నిందితులను రాజకీయంగా కాపాడారంటూ ఆరోపించారు.

**"హత్యా రాజకీయాలు ఎవరివి?"**

ఈ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడిని టార్గెట్ చేసిన జగన్ "గొడ్డలి పార్టీ ఎవరిది? గన్ కల్చర్ ఎవరిది? హత్యా రాజకీయాలు ఎవరివి?" అంటూ వరుస ప్రశ్నలు సంధించారు. వంగవీటి రంగా హత్య, జర్నలిస్ట్ పింగళి దశరథరామ్ హత్య, మల్లెల బాబ్జీ అనుమానాస్పద మరణం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ ప్రతి ఘటనలో వేళ్లు ఎటు చూపించాయో ప్రజలకు తెలుసన్నారు. "చరిత్రను తుడిచేయలేరు. ప్రజలు అన్నీ గుర్తుంచుకుంటారు" అని వ్యాఖ్యానించారు.

**వివేకా కేసు... దస్తగిరిపై ప్రశ్నలు**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావించిన జగన్ "తానే హత్య చేశానని టీవీ ఇంటర్వ్యూల్లో మాట్లాడిన దస్తగిరి బయట స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. జైల్లో ఉండాల్సిన వ్యక్తికి రాజకీయ రక్షణ ఎందుకు?" అని ప్రశ్నించారు. "హత్య కేసులో అప్రూవర్‌గా మారిన వ్యక్తి కార్లలో తిరుగుతుంటే... బాధిత కుటుంబం మాత్రం న్యాయం కోసం మాట్లాడాల్సి వస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేసులను మలుపు తిప్పడం, నిర్దోషులపై బురదజల్లడం జరుగుతోందని ఆరోపించారు.

**ప్రశ్నిస్తే కేసులా?**

రాష్ట్రంలో సోషల్ మీడియా యాక్టివిస్టులు, ప్రతిపక్ష

2లో



### నాలుగు యూసీఎఫ్ ప్రాజెక్టులకు కేంద్రం

# గ్రీన్ సిగ్నల్

అమరావతి, మే 21 : ఆంధ్రప్రదేశ్‌లో రూ. 1,990.83 కోట్ల విలువైన అర్బన్ ఛాలెంజ్

మిగతా 2వ పేజీలో..

### పశ్చిమాసియా సంక్షోభ ప్రభావాలపై కేంద్ర కేబినెట్

# కీలక చర్చ

ఢిల్లీ, మే 21 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు (గురువారం) సాయంత్రం 5 గంటలకు కేంద్ర మంత్రిమండలి సమావేశం ప్రారంభమైంది. అయితే, 11 నెలల తర్వాత కేంద్ర కేబినెట్ సమావేశమైంది. జూన్ 9వ తేదీకి మోదీ ప్రభుత్వం రెండేళ్ల పూర్తి చేసుకుంటున్న విషయం తెలిసిందే. కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధానంగా దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో

2లో

### నారా లోకేష్ నేతృత్వంలోని కమిటీకి

# చంద్రబాబు దిశానిర్దేశం



2లో

- పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు వెంటనే ప్రారంభం కావాలని ఆదేశం
- ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల విలువైన 282 ప్రాజెక్టులకు ఆమోదం
- ఇప్పటికే 114 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని వెల్లడించిన అధికారులు
- అనుమతులు, భూ కేటాయింపులు వేగవంతం చేయాలని సీఎం సూచన

మే 21 : రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు

### కిరీటం మాయంపై విచారణ.. అందుబాటులోని లేని ట్రస్ట్ సభ్యులు..

# ఏసీ ఆగ్రహం

2లో





### భగీరథ్‌ను అప్పగించలేదు.. పోలీసులే

# అరెస్ట్ చేశారు

- అప్పా జంక్షన్ తనిఖీల్లో బండి భగీరథ్ అరెస్ట్
- లొంగిపోయారనే ప్రచారాన్ని ఖండించిన రేవంత్
- పోలీసుల దర్యాప్తు సమాచారానికే ముఖ్యమంత్రి మద్దతు



2లో



### ఢిల్లీలో తొలి కేసు..

### వడదెబ్బకు విద్యార్థి

# మృతి

మిగతా 2లో...

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# చలివేంద్రం ఏర్పాటుతో ప్రజల దాహార్తిని తీరుస్తున్నాం

## - శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ ఎండి అజయ్ కుమార్ వెల్లడి








మదనపల్లె (ప్రజా సీమ) : ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్ పేర్కొన్నారు.ఆర్టీసీ 1వ డిపో ఆధ్వర్యంలో శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ సౌజన్యంతో గురువారం పట్టణంలోని రింగ్ రోడ్డు సర్కిల్,శ్రీ చౌడేశ్వరి కళ్యాణ మండపం ఎదురుగా చలివేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయన్నారు.ఎండలు,వడగాలుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ముఖ్యంగా రింగురోడ్డు సర్కిల్ వద్ద ఆర్టీసీ బస్టాప్ ఉందని,సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు,ఇక్కడ దిగే ప్రయాణికులకు చలివేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.ఇక్కడ కడవలను ఏర్పాటు చేసి నిరంతరం స్వచ్ఛమైన తాగునీరును అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు.అనంతరం ఇంచార్జి సిఐ వాలే నాయక్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు వినూత్నమైన కంప్యూటర్ కోర్సులు నేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే కాకుండా సమాజ సేవా కార్యక్రమాల్లో తనదైన పాత్ర పోషిస్తున్న శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ అధినేత అజయ్ కుమార్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు.సేవా కార్యక్రమాలలో యువత ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు.చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.భవిష్యత్తులో సేవా కార్యక్రమాల్లో అజయ్ కుమార్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్యానికి ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అధిక ప్రాధాన్యత

## - ఎస్పీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు





మదనపల్లె (ప్రజా సీమ) : అహర్నిశలు ప్రజల రక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసు అధికారులు,సిబ్బంది శారీరక,మానసిక ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి గురువారం మదనపల్లిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భారీ ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు.విధి నిర్వహణలో నిత్యం తీవ్ర ఒత్తిడికి లోనయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా,ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎస్పీ పిలుపునిచ్చారు. అంజనా స్కాన్స్ అండ్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సిబ్బందికి అత్యంత కీలకమైన సి.బి.సి (రక్త పరీక్ష),కిడ్నీ,లివర్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలతో పాటు బ్లడ్ షుగర్ మరియు మూత్ర పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నారు.జిల్లాలోని పోలీస్ అధికారులు,సిబ్బంది మరియు హోంగార్డులు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య సంరక్షణ కోసం ఈ సువర్ణ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎస్పీ సూచించారు.పోలీసుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన అంజనా డయాగ్నోస్టిక్స్ యాజమాన్యానికి ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ హెల్త్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి, ఏఆర్ డిఎస్పీ డి.ఏడుకొండల రెడ్డి,పలువురు సీఐలు,ఆర్ఐలు, ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు,పోలీసు సిబ్బంది,హోంగార్డులతోపాటు పోలీసు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఉచిత మెడికల్ చెకప్ పరీక్షలు చేయించుకున్నారు.

# పశ్చిమాసియా సంక్షోభ ప్రభావాలపై కేంద్ర కేబినెట్ కీలక చర్చ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలకు చేరుతున్న సేవలు, వివిధ పథకాల అమలు స్థితి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రభావంపై మంత్రులతో ప్రధాని మోదీ మాట్లాడుతున్నారు. అలాగే దేశవ్యాప్తంగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై కూడా సమీక్షించనున్నారు. రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు వంటి కీలక ప్రాజెక్టుల అమలు వేగం, పెట్టుబడుల పరిస్థితి, భవిష్యత్తు కార్యాచరణపై మంత్రివర్గంతో ప్రధాని చర్చించనున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు దారితీస్తున్న పశ్చిమాసియా సంక్షోభంపై కూడా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలోని పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావం, చమురు ధరల మార్పులు, వాణిజ్యంపై పడే ప్రభావం వంటి అంశాలను ప్రధాని మోదీ సమీక్షిస్తున్నారు. వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, తీసుకున్న నిర్ణయాలు, రాబోయే రోజుల కార్యాచరణపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రులు తమ శాఖలకు సంబంధించిన పురోగతి నివేదికలను ప్రధాని ముందు ఉంచినట్లు సమాచారం. ఈ సమావేశంలో భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు, పెట్టుబడుల ప్రోత్సాహం, ఆర్థిక వృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మరింత సమర్థవంతమైన అమలుపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

# నారా లోకేష్ నేతృత్వంలోని కమిటీకి చంద్రబాబు దిశానిర్దేశం

కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు (ఎంవోయూలు), రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రాజెక్టుల పురోగతిపై ఆయన గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీకి సీఎం దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చంద్రబాబు గుర్తుచేశారు. వీటిలో 114 ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని (గ్రౌండింగ్ అయ్యాయని) అధికారులు సమావేశంలో వివరించారు.

మిగిలిన ప్రాజెక్టుల విషయంలో జాప్యం జరగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. వాటికి అవసరమైన అనుమతులు, భూ కేటాయింపుల ప్రక్రియను వేగవంతం చేసి, అవి కూడా త్వరగా గ్రౌండింగ్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్ధన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నాలుగు యూసీఎఫ్ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..

ఫండ్ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ మేరకు నాలుగు కీలకమైన పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వెల్లడించారు. యూసీఎఫ్ ద్వారా ఈ ప్రాజెక్టుల కోసం కేంద్రం రూ.497.71 కోట్ల ఆర్థిక సహాయం అందించనుందని మంత్రి పేర్కొన్నారు.

విశాఖపట్నం, మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నాలుగు ప్రాజెక్టులకు ఆమోదం లభించడం ఏపీకి గొప్ప గుర్తింపు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది.

# మాదే పెద్ద బాధిత కుటుంబం

కార్యకర్తలపై కేసులు నమోదవుతున్నాయని జగన్ ఆరోపించారు. "ప్రశ్నిస్తే కేసులు... ఎదిరిస్తే అరెస్టులు... ఇదే ఇప్పుడు పాలనగా మారింది" అని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల హత్యలు, తప్పుడు కేసులు, సోషల్ మీడియా పోస్టుల తొలగింపులను ప్రస్తావిస్తూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్ నడుస్తోందని విమర్శించారు. "పోలీసులు చట్ట పరిరక్షకుల్లా కాకుండా రాజకీయ వ్యవస్థకు పని చేస్తున్నారనే భావన ప్రజల్లో పెరుగుతోందని వ్యాఖ్యానించారు.

**మానాన్న ప్రతీకారం నేర్పలేదు**

తన ప్రసంగంలో చివరగా జగన్ భావోద్వేగానికి లోనయ్యారు. "జగన్ చెడ్డోడైతే మా కుటుంబాన్ని నాశనం చేసిన వాళ్లు ఈరోజు ప్రశాంతంగా బతికేవారా?" అని ప్రశ్నించారు. "మాకు మా తండ్రి నేర్పింది హత్యలు చేయమని కాదు... ప్రజలకు మంచి చేసి పేరు సంపాదించమని. అదే మా రాజకీయాల తత్వం" అని పేర్కొన్నారు. "విలువలు, విశ్వసనీయతతో రాజకీయాలు చేయడమే మా మార్గం" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

# భగీరథ్‌ను అప్పగించలేదు.. పోలీసులే అరెస్ట్ చేశారు

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీసులు చట్టప్రకారమే అరెస్ట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అప్పా జంక్షన్ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. తనకు పోలీసులు ఇచ్చిన సమాచారం ఇదేనని.. వారి మాటలనే తాను నమ్ముతానని పేర్కొన్నారు.

అది సరెండర్ ఎలా అవుతుంది?

బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించారనే ప్రచారాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. ఒకవేళ ఆయనే అప్పగించాలనుకుంటే పోలీసులను ఇంటికి పిలిచి అప్పగించాల్సిందని అభిప్రాయపడ్డారు. రోడ్డు మధ్యలో ఉన్న అప్పా జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుంటే అది సరెండర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? అని నిలదీశారు.

బాలిక విషయంలో రాజకీయం వద్దు

ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం పద్ధతి ప్రకారం చర్యలు తీసుకుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సున్నితమైన కేసులో బీఆర్ఎస్ నాయకులు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారే విచారణ జరిపి, వాళ్లే తీర్పులు ఇచ్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోక్సో కేసులో మైనర్ బాలిక వివరాలు వెల్లడిస్తే ఆ కుటుంబానికి ఎంతో ఇబ్బంది కలుగుతుందని, కేటీఆర్ రాజకీయాల కోసం ఒక బాలికను అడ్డుపెట్టుకోవడం సరికాదన్నారు.

# ఢిల్లీలో తొలి కేసు.. వడదెబ్బకు విద్యార్థి మృతి..

న్యూఢిల్లీ, మే 21: దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పగటి పూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలను మించి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండ వేడి తట్టుకోలేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బ కారణంగా ప్రాణాలు సైతం పోతున్నాయి.

ఢిల్లీలో తొలి కేసు..

దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ యువకుడు వడదెబ్బ కారణంగా ప్రాణాలు కోల్పోయాడు. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 24 ఏళ్ల ఓ విద్యార్థి ఢిల్లీలో చదువుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం అతడు వడదెబ్బకు గురై కుప్పకూలాడు. స్థానికులు అతడిని డాక్టర్ ఎమ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చేర్చారు. డాక్టర్లు బాధితుడి శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీల ఫారెన్ హీట్ ఉన్నట్లు గుర్తించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు.

అయితే, డాక్టర్ల ప్రయత్నాలు ఫలించలేదు. చికిత్స పొందుతూ అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఎండాకాలం మొదలైన తర్వాత ఢిల్లీలో చోటుచేసుకున్న మొదటి వడదెబ్బ మరణం ఇదే కావటం గమనార్హం. ఈ విషయాన్ని వైద్యాధికారులు స్వయంగా వెల్లడించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. మధ్యాహ్నం వేళ అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రాకూడదని హెచ్చరించారు. ఎండలోకి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కిరీటం మాయంపై విచారణ.. అందుబాటులోని లేని ట్రస్ట్ సభ్యులు.. ఏసీ ఆగ్రహం

కృష్ణాజిల్లా, మే 21 : గుడివాడలోని ప్రసిద్ధ శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కోటి రూపాయల విలువైన బంగారు కిరీటం మాయంపై దేవాదాయ శాఖ విచారణ చేపట్టింది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత హుటాహుటిన ఆలయానికి చేరుకుని అర్చకుల నుంచి వివరాలు సేకరించారు. దేవస్థానం నిర్వహణ ట్రస్ట్ కార్యాలయానికి తాళాలు తెరిపించి రికార్డులు ఇవ్వాలని అడిగినట్లు సమాచారం. ట్రస్ట్ బోర్డులోని 31 మంది సభ్యులు ఎవరూ అందుబాటులో లేమంటూ ఫోన్లో సమాధానం చెప్పడంతో ఏసీ లలిత విస్మయం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇచ్చినా అందుబాటులో లేకపోవడం ఏంటని ట్రస్ట్ సభ్యులపై లలిత ఆగ్రహం వ్యక్తం చేశారు. దాత కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఏసీ లలిత.. పూర్తి వివరాలు సేకరించారు. దేవాదాయ శాఖ కమిటీ పరిధిలో ట్రస్ట్ లేకపోవడంతో చర్యలు తీసుకోలేకపోతున్నామని స్పష్టం చేశారు. రికార్డులు పరిశీలించిన తర్వాతే ఏ విషయమైనా చెప్పగలమని వెల్లడించారు. బంగారు కిరీటం తాకట్టు వ్యవహారంలో ట్రస్ట్ కమిటీ సభ్యుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విచారణ ముమ్మరం చేశారు. మధ్యాహ్నంలోపు విచారణ నివేదిక అందించాల్సి ఉండటంతో ఏసీ లలిత ఆలయంలోనే వేచి ఉన్నారు. ఈ వ్యవహారంలో తాకట్టు కొట్టు వ్యాపారి పరారీలో ఉన్నాడు. తన ఖాతాకు తాకట్టు డబ్బులు జమ చేస్తేనే ఊరికి వస్తానని ట్రస్ట్ బోర్డుకు తాకట్టు వ్యాపారి సమాచారం పంపినట్లు తెలుస్తోంది.

ట్రస్ట్ సభ్యులకు యలవర్తి శ్రీనివాసరావు హెచ్చరిక

విచారణ జరుగుతున్న సమయంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ఆలయానికి చేరుకున్నారు. దేవస్థాన ట్రస్ట్ బోర్డు చేసిన తప్పిదంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన వల్ల గుడివాడకు చెడ్డపేరు వస్తోందని కమిటీ సభ్యులకు ఫోన్ చేసి చెప్పానని తెలిపారు. కిరీటాన్ని స్వామివారికి అలంకరించాలని భక్తుల తరఫున డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు స్పందించకపోవడంతో కిరీటం అలంకరించే వరకు ఆలయంలోనే కూర్చుంటానని యలవర్తి స్పష్టం చేశారు. కిరీటం తాకట్టు పెట్టుకున్న బంగారు వ్యాపారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవుడి విషయంలో జరిగిన అపచారం భక్తులను కలచివేసిందని, దీనిపై ఉన్నత స్థాయికి వెళ్తానని హెచ్చరించారు. సాయంత్రంలోపు కిరీటం అలంకరించకపోతే భక్తులతో కలిసి యాక్షన్ ప్లాన్‌లో దిగుతామని స్పష్టం చేశారు. భక్తుల మనోభావాలతో చెలగాటమాడితే సహించేది లేదని యలవర్తి శ్రీనివాసరావు హెచ్చరిక జారీ చేశారు.

# దేశ అభివృద్ధిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పాత్ర అమోఘం

### - ఏపీసిసి జనరల్ సెక్రెటరీ ఎస్.అల్లా బకష్,రెడ్డి సాహెబ్ ప్రశంసలు



మదనపల్లె (ప్రజా సీమ) : దేశంలో శాస్త్ర,సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసిన మహానీయుడు,భారతరత్న దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని ఏపీసిసి జనరల్ సెక్రెటరీ ఎస్.అల్లా బకష్,మైనార్టీ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా,మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ పేర్కొన్నారు.భారత సమాచార విప్లవ పితామహుడు,మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని గురువారం మదనపల్లె పట్టణం,ఇందిరా నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.మాజీ ప్రధాని,ఆధునిక భారత స్వాప్నికుడు,సాంకేతిక సంస్కరణల సృష్టికర్త,భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మహనీయుడికి అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఘనంగా నివాళులర్పిస్తున్నామన్నారు.ప్రపంచం ముంగిట నేడు అగ్రగామిగా దేశం ఉందంటే నాడు రాజీవ్ గాంధీ,కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంస్కరణల వ్యయవేనన్నారు.విద్య,సాంకేతికత,టెలి కమ్యూనికేషన్,గ్రామీణాభివృద్ధి,ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి మూలస్తంభాలన్నారు.ఐటీ రంగానికి పితామహుడుగా,టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడుగా,దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా రాజీవ్ గాంధీ ఎన్నటికీ చెరగని ముద్ర వేశారన్నారు.గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి,స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు,యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ పాలన ఆచరణీయమన్నారు.రాజీవ్ గాంధీ హత్యకు గురైన తరువాత ఈ రోజును దేశంలో ఉగ్రవాద రహిత దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.యువత శక్తిపై అపార విశ్వాసం ఉంచిన రాజీవ్ గాంధీ,దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నమ్మారని గుర్తుచేశారు.18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో యువశక్తికి ప్రాధాన్యం పెంచారని పేర్కొన్నారు.సాంకేతికతను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి,దేశ అభివృద్ధిని వేగవంతం చేయాలన్న రాజీవ్ గాంధీ ఆశయాలను,ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మీనా కుమారి,మాజీ మండలాధ్యక్షులు ముబారక్ ఖాన్,మాజీ డిసిసి సెక్రటరీ డాక్టర్ వర్ధన్ చౌదరి,మాజీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు సోమశేఖర్,మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ మహబూబ్ పీర్,మాజీ మహిళా టౌన్ప్రెసిడెంట్ ఈశ్వరమ్మ,మాజీ మండల బీసీ సెల్ అధ్యక్షులు నాగరాజ,మాజీ టౌన్ సెక్రటరీలు పాలేటి,మహమ్మద్ అలీ,యూత్ కాంగ్రెస్ నాయకులు శరత్ కుమార్ రెడ్డి,మైనార్టీ నాయకులు యూసుఫ్ ఖాన్,ఇర్ఫాన్,దస్తగిరి ఖాన్,ఉస్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీధర్ పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి





పెనగలూరు (ప్రజా సీమ ):తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న అరవ శ్రీధర్ పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెనగలూరు మండలానికి చెందిన షేక్ షామీర్ భాష పెనగలూరు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా షేక్ షామీర్ భాష మాట్లాడుతూ ఒక రైల్వే కోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ఆరవ శ్రీధర్ గౌరవప్రదమైన పదములో ఉండి ముస్లిం మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడుతూ ముస్లిం మహిళలను కించపరిచే విధంగా అసభ్య పదజాలంతో మాట్లాడడం తీవ్రంగా బాధించిందని ఇది ముస్లిం మహిళల పట్ల చులకన భావంతో మాట్లాడడం ఆ వీడియో సామాజిక మాధ్యమాలలో రావడం ఎంతగానో బాధించిందని కావున అరవ శ్రీధర్ పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు మరియు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అతనిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### -మెడికల్ఆఫీసర్ డాక్టర్ శివప్రసాద్




చిట్వేలి(ప్రజా సీమ):మండలంలోని ప్రజలు వడదెబ్బ తగలకుండా వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై జాగ్రత్తలు వహించాలని చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివప్రసాద్, అన్నారు. గురువారం, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ శాతం పొలం పనులకు వెళ్లేవారు వేసవి తాపానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు ఎక్కువ తాగాలని సూచించారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండలో తిరగకుండా ఉండడం మంచిదన్నారు. వడదెబ్బ తగలకుండా అలాంటి పరిస్థితి వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని సూచించారు. అందుబాటులో ప్రజలకు ఉంటామని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని విధాల మందులు అందుబాటులో ఉన్నత స్థాయి అధికారులు ఏర్పాటు చేశారని తెలియజేశారు. ఆరు పడకల ఆసుపత్రిలో మౌలిక వసతులు కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి పల్లెలో కూడా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఏ గ్రామంలోనైనా వైద్య సిబ్బంది వలన ఇబ్బంది ఉన్న మా దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి వైద్యం అందించడమే మా బాధ్యత అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిట్స్ వర్శిటీలో ఆకట్టుకున్న ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

### - హాజరైన బెంగళూరు హెచ్‌సీఎల్ గువి సంస్థ డైరెక్టర్ లక్ష్మణన్





మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ మరియు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగాల ఆధ్వర్యంలో ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన హెచ్‌సీఎల్ గువి సంస్థ,డైరెక్టర్ లక్ష్మణన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం హెచ్‌సీఎల్ గువి సంస్థ వారి ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ గువి ట్రైనర్లు విద్యార్థులకు జావా మరియు పైథాన్ ప్రోగ్రామింగ్ భాషలపై నెలరోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు జావా,పైథాన్ ఆధారిత ప్రోగ్రామింగ్ టాస్కులు,కోడింగ్ సమస్యలు మరియు రియల్ టైమ్ అప్లికేషన్ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్ట్ కార్యకలాపాలను అప్పగించి వారి సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచారని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు,మెషిన్ లెర్నింగ్,డేటా సైన్స్ మరియు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి పలు ఆధునిక సాంకేతిక రంగాలలో రూపొందించిన సమస్యలకు విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అందించారని తెలిపారు. మొత్తం 30 బృందాలు పాల్గొన్న ఈ హ్యాకథాన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి 10,000/-,రెండవ బహుమతి,5,000 /-,మూడవ బహుమతిగ 3,000/- నగదు మరియు సర్టిఫికెట్స్ విద్యార్థులకు అందజేశారు. విద్యా జ్ఞానం మరియు పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణల ద్వారా విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్,వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్,డేటా అనలిటిక్స్,ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్,మెషిన్ లెర్నింగ్ మరియు క్లౌడ్ టెక్నాలజీ రంగాలలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారిని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో సహాయ,సహకారాలు అందించిన మిట్స్ యూనివర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్,విభాగాధిపతులు డాక్టర్ ఆర్ కల్పనా,డాక్టర్ ఎస్.పద్మ,డాక్టర్ చొక్కానాథన్,కో-ఆర్డినేటర్స్ శాయిజ్ అహమ్మద్,ఉష,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బెంగళూరులో ఘనంగా రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు

### - హాజరైన హాజీ మహమ్మద్ ఫరూక్ శుబ్లీ,పఠాన్ ఖాదర్ ఖాన్







మదనపల్లె (ప్రజా సీమ) : ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అలాగే ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవి శంకర్ గురూజీ 70వ జన్మదిన వేడుకలను గురువారం బెంగళూరులోని ఆశ్రమంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేసి ప్రత్యేకంగా పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో కొద్ది మంది ప్రముఖులకు మాత్రమే ఆహ్వానం అందించిన ఈ కార్యక్రమానికి గురూజీ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ హాజీ మహమ్మద్ ఫరూక్ శుబ్లీ కలిసి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురూజీని కలిసి ఆశీస్సులు పొందిన వారు ఆధ్యాత్మిక విలువలు,మానవతా సేవలు మరియు ప్రపంచ శాంతి కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ చేస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుల అభ్యర్థన మేరకు తమ అభిప్రాయాలను సంతోషంగా వ్యక్తపరిచారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం,మానవీయ విలువలు పెంపొందించడంలో గురూజీ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేశ,విదేశాల నుండి పలువురు ఆధ్యాత్మిక ప్రముఖులు,ప్రజాప్రతినిధులు,విశిష్ట అతిథులు పాల్గొని గురూజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

### -డిఎఫ్ఓ వినీత్ కుమార్




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ::ఎర్రచందనం అక్రమంగా తరలి పోకుండా ఉండేందుకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు . డిఎఫ్ఓ వినీత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక అటవీ క్షేత్ర కార్యాలయంలో నూతనంగా నిర్మించిన అటవీ క్షేత్రాధికారి కార్యాలయాన్ని డిఎఫ్ఓ వినీత్ కుమార్ ప్రారంభించారు. అలాగే కార్యాలయ ఆవరణంలో మొక్కలను నాటారు. అనంతరం విలేకరులతో డిఎఫ్ఓ వినీత్ కుమార్ మాట్లాడుతూ .ఫారెస్టులో ఆక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. నెమళ్ళ పునరుత్పత్తి కేంద్రంలో నెమళ్ల సంరక్షణ కోసం ఈ ఏడాది రూ 15 లక్షలు ఖర్చు చేసి కంచె, సిసి కెమెరాలు ఏర్పాటుతో పాటు ఇతర పనులు చేపట్టుతున్నట్లు తెలిపారు. నెమళ్ళ పునరుత్పత్తి కేంద్రాన్ని రిసోర్స్ గా చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. వేంపల్లె ఫారెస్ట్ రెంజ్ లో 31 వేల హెక్టార్లలో అటవీ భూమి ఉన్నట్లు చెప్పారు. వేంపల్లి అటవీ ప్రాంతంలో తనిఖీలు చేయడానికి అటవీ ప్రాంతంలో రోడ్లు లేక పోవడంతో అధికారులకు, సిబ్బందికి ఇబ్బందికరంగా ఉందని కాబట్టి రోడ్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు లేక పోవడంతో నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని దీంతో పెట్రోలింగ్, మానిటరింగ్ చేసేందుకు కష్టతరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె ఫారెస్ట్ రెంజ్ అధికారి బాల సుబ్రమణ్యం, డిఆర్ఓ వెంకట సుబ్బయ్య, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎ. ఎన్. ఆర్ కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి సుభాషిణికి డాక్టరేట్ ప్రధానం

మే 21(గడివాడ):ఎ.ఎన్.ఆర్. కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ రసాయన శాస్త్ర విభాగాధిపతి కంతేటి సుభాషిణి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఆర్. రమేష్ రాజు పర్యవేక్షణలో "కంప్రెహెన్సివ్ డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ ఎల్ సీ అండ్ ఎల్ సీ-ఎం ఎస్ మెథడ్స్ ఫర్ సెలెక్టెడ్ డ్రగ్స్ విత్ ఎంఫసిస్ ఆన్ స్టెబిలిటి అండ్ ఇంప్యూరిటీ ప్రొఫైలింగ్" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్.డి) డిగ్రీని నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రకటించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జె.ఎస్. కుమార్ తెలియచేసారు.

# చట్టాలపై యువతులు,మహిళలు అవగాహన పెంచుకోవాలి

## - జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ సూచనలు
## - విశ్వం కళాశాలలో భారీ అవగాహన సదస్సు




మదనపల్లె (ప్రజా సీమ) : సమాజంలో మహిళల రక్షణ,భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూనే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా యువత నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పిలుపునిచ్చారు.గురువారం మదనపల్లిలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల వేదికగా మహిళల భద్రత,రహదారి క్రమశిక్షణ,సైబర్ నేరాల పట్ల అవగాహన,మాదకద్రవ్యాల నిర్మూలనపై భారీ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ విచ్చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా,ఆన్‌లైన్ లావాదేవీల పట్ల విద్యార్థినులు,మహిళలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్,మెసేజ్లకు స్పందించి మోసపోవద్దని,ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ లాంటి కొత్త రకం సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.యువత భవిష్యత్తును బూడిద పాలు చేస్తున్న మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారిని జిల్లా నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తుపదార్థాల విక్రయాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.విద్యార్థినులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,రహదారి నిబంధనలు పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు.మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని,ఎలాంటి ఆపద సమయాల్లోనైనా భయపడకుండా తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్‌ను కానీ, లేదా టోల్ ఫ్రీ నంబర్లు 100,112లను కానీ సంప్రదించాలన్నారు. అలాగే మాదకద్రవ్యాల సమాచారం కోసం ప్రత్యేక ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేయాలని కోరారు.ముఖ్యంగా ప్రతి మహిళా తమ స్మార్ట్‌ఫోన్లలో "శక్తి యాప్"ను డౌన్‌లోడ్ చేసుకోవాలని,విపత్కర పరిస్థితుల్లో ఈ యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే కేవలం కొద్ది నిమిషాల్లోనే శక్తి టీమ్స్ లేదా స్థానిక పోలీసులు మీ వద్దకు చేరుకుని రక్షణ కల్పిస్తారని ఎస్పీ భరోసానిచ్చారు.అనంతరం అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల నేరాల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని తెలిపారు.విద్యార్థినులు తమ కాలేజీ పరిసరాల్లో గానీ,ప్రయాణాల్లో గానీ వేధింపులకు గురైతే నిశ్శబ్దంగా భరించకుండా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,బాధితులకు తక్షణ న్యాయం అందిస్తున్నామని వివరించారు.ఈ సదస్సులో మదనపల్లి డిఎస్పీ బి.పావని మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని సమాజంలో అగ్రస్థానంలో నిలవాలే తప్ప,క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల,పరిచయం లేని వ్యక్తుల పరిచయాల వల్ల జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు.మహిళా రక్షణ చట్టాలు,శక్తి టీమ్స్ పనితీరుపై ఆమె అవగాహన కల్పించారు.కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థినుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి,స్వయంగా జిల్లా ఎస్పీ మరియు ఉన్నతాధికారులు విచ్చేసి ఇంతటి అద్భుతమైన అవగాహన సదస్సును నిర్వహించడం పట్ల జిల్లా పోలీస్ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఇటువంటి అవగాహన క్లాసులు విద్యార్థినులలో మానసిక ధైర్యాన్ని,ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమ నిర్వహణకు శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సంపూర్ణ సహకారం అందించారు. ఈ విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జి.శంకర మల్లయ్య,మదనపల్లి రూరల్ సీఐ రవి నాయక్,మదనపల్లి టూ టౌన్ సీఐ మహమ్మద్ రఫీ,ముదివేడు ఎస్ఐ మధు రామచంద్రుడు,శక్తి టీం సిబ్బంది ముని కుమార్ నాయక్,మణికంఠ,వీణ,శశికళ,శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ బిందు,సిబ్బంది,అధ్యాపకులు,లాక్మీ అకాడమీ సత్రశాల వెంకటేష్,సౌజన్యలతోపాటు విశ్వం ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం,అధ్యాపక బృందం,ఐసిడిఎస్ అధికారులు,ఆశావర్కర్లు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలి



ప్రొద్దుటూరు, (ప్రజా సిమ): ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని ఎన్ఎంయుఏ ప్రొద్దుటూరు డిపో నాయకులు నారాయణ డిమాండ్ చేశారు. గురువారం రెండవ రోజు ఎన్ఎంయుఏ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు రెండవ రోజు డిపో నాయకుల టిఆర్జీ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు ప్రొద్దుటూరు డిపో వద్ద గేట్ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు డిపో నాయకులు నారాయణ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, స్త్రీ శక్తి బస్సులలో జీరో టికెట్ ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి మిగతా ప్రయాణికులకు టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని కండక్టర్లపై పనిభారం తగ్గించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏ లు అరియర్స్ మరియు లీవ్ ఎన్కాష్మెంట్ ఇవ్వాలని, రిటైర్డ్ అయిన, చనిపోయిన సిబ్బందికి వెంటనే సెటిల్మెంట్స్ చేయాలని, ఏపీ పిటిడి ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుండి మినహాయించి గతంలో ఆర్టీసీ నందు ఉన్న వైద్య సదుపాయం అమలు చేయాలని కోరారు. జోనల్ నాయకులు రామకృష్ణ, రీజన్ నాయకుడు భాను ప్రసాద్ డిపో నాయకులు వై ఆర్ కె రెడ్డి, డిపో సెక్రెటరీ గోపాల్, గ్యారేజ్ సెక్రటరీ అశోక్, గ్యారేజ్ నాయకులు అల్తాఫ్, నాయకులు, మరియు ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు డిపో కమిటీ ధన్యవాదాలు తెలిపారు.


# సీనియర్ పాత్రికేయుడు హరినాథ్ కి మాతృవియోగం

## - నివాళులర్పించిన వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్



రామసముద్రం (ప్రజా సీమ) : నియోజకవర్గం రామసముద్రం మండలం,ఉలపాడు గ్రామపంచాయతీ,దిన్నెపల్లెకి చెందిన నేటి దినపత్రిక సూర్య రిపోర్టర్ హరినాథ్ తల్లిగారైన లక్ష్మమ్మ గురువారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మదనపల్లె నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్ వారి నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరినాథ్ గారిని మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.లక్ష్మక్క ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి,మండల కన్వీనర్ కేశవరెడ్డి,రెడ్డి వీరే గౌడ్,తిమ్మా రెడ్డి,రాధాకృష్ణ,ఎల్.రఘునాథ రెడ్డి,కొత్తపల్లి నాగార్జున నాయుడు,విష్ణువర్ధన్ రెడ్డి,జి.వి ప్రసాద్,ఫయాజ్ ఖాన్ స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# పంజం సుకుమార్ రెడ్డి కి ఘన నివాళులు అర్పించిన ఎంపీపీ ముద్దా, వైస్ ఎంపీపీ రామిరెడ్డి




రైల్వే కోడూరు (ప్రజా సీమ ) తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట పంచాయతీ తూర్పుపల్లి గ్రామంలో వైసీపీ సీనియర్ నాయకులు, అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ దివంగత పంజం సుకుమార్ రెడ్డి సంవత్సరీక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుల్లంపేట ఎంపీపీ ముద్ద బాబుల్ రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు మరియు రైల్వే కోడూరు మండల వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి హాజరై సుకుమార్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పంజం కుటుంబ సభ్యులను కలిసి చర్చించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పంజం సుకుమార్ రెడ్డి ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడని కొనియాడారు. రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా విద్యావేత్తగా కూడా ఆయన ఎంతో మందికి మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, విద్యా అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిగా, నిగర్వి గా సుకుమార్ రెడ్డి పేరు ప్రాఖ్యాతులు సంపాదించుకున్నారని గుర్తుకు తెచ్చుకున్నారు .భౌతికంగా ఆయన మన మధ్య లేకున్న , ఆయన ఆలోచనలు, సేవా కార్యక్రమాలు, ప్రజల పట్ల చూపే ఆధారాభిమానాలు ఎప్పటికీ చిరస్థాయి గా మదిలో నిలిచిపోతాయని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో పంజం వేణుగోపాల్ రెడ్డి పందెం శ్రీ వర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు కౌరెడ్డి సిద్దయ్య యాదవ్, ప్రతాప్ రెడ్డి, బాబు రెడ్డి, సర్పంచులు దార్ల చంద్రశేఖర్, ఆర్వీ రమణ, గోపి, సుబ్రహ్మణ్యం రాజు, సుబ్బయ్య, ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, బత్తల సుబ్రహ్మణ్యం, అనంతరాజుపేట మణి యాదవ్, అనంతరాజుపేట షఫీ, గ్రామ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# ఐటీ మంత్రి నారా లోకేష్ బాబుని కలిసిన రామకృష్ణ ఆచారి

మదనపల్లె (ప్రజా సీమ) : కడప పర్యటన నిమిత్తం వెళ్తున్న టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,మంత్రి నారా లోకేష్ బాబుని గురువారం గన్నవరం విమానాశ్రయంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు.అదేవిధంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు,విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,శాసనమండలి మాజీ చైర్మన్ ఎమ్.ఏ షరీఫ్ లను మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎస్.ఏ.మస్తాన్ తోపాటు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పచ్చిపాల రామకృష్ణ ఆచారి తన సతీమణి పచ్చిపాల తులసికి రాష్ట్ర కార్యదర్శి పదవి అప్పగించినందుకు లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.మంత్రి నారా లోకేష్ తన తండ్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు,సలహాలతో పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నాడని,ఆయన సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని కొనియాడారు.అదేవిధంగా ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తూ ఐటీ రంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు.అటువంటి నాయకుడి సారథ్యంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు.ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలిసి మదనపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని,స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఒక ప్రణాళికతో ముందుకు సాగాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.

# గో టు విలేజ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం



మే 21(గన్నవరం): అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన గన్నవరం నియోజకవర్గ స్థాయి సమావేశంలో "గో టు విలేజ్ క్యాంపెయిన్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్పిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంద కృష్ణ మాదిగ ఆదేశానుసారం గ్రామస్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య కృష్ణా జిల్లా అధ్యక్షులు దేవరపల్లి విక్టర్ బాబు, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి తొమ్మండ్రు యువరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు రావేళ్ళ వరుణ్ కుమార్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ఎంఈఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షులు దేవరపల్లి విక్టర్ బాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంఆర్పిఎస్, ఎంఈఎఫ్ నాయకులు మాట్లాడుతూ గ్రామాలకు వెళ్లి విద్యా, ఉపాధి అవకాశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్గీకరణ ద్వారా లభించే విద్యా, ఉద్యోగ అవకాశాలను వివరించాలని, ప్రతి గ్రామంలో ఎంఆర్పిఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఎంఆర్పిఎస్ జెండా దిమ్మలు లేని గ్రామాలలో జెండా దిమ్మలు నిర్మించాలని, జూలై 7న జరిగే ఎంఆర్పిఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం నాటికి ప్రతి గ్రామంలో ఎంఆర్పిఎస్ జెండా రెపరెపలాడేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ఎంఎస్పీ ఇన్‌చార్జి మందా వేణు మాదిగ, కో ఇన్‌చార్జి కొప్పులు కామేశ్వరరావు మాదిగ, జు మాదిగ, గన్నవరం టౌన్ అధ్యక్షులు అవినాష్‌మాదిగ, పాల్గొన్నారు.

# కొండమర్రి శ్రీహరి నాయుడు సేవలు యువతకి ఆదర్శం

## - ఘనంగా సన్మానించిన పాలఏకరి కులబాంధవులు





మదనపల్లె (ప్రజా సీమ) : ఎన్ఆర్ఐ పాలఏకరి కువైట్ అధ్యక్షులు కొండమర్రి శ్రీహరి నాయుడు సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.బోయకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో పాలఏకరి కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్ఆర్ఐ పాలఏకరి కువైట్ అధ్యక్షులుగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తూ స్వగ్రామ అభివృద్ధి,సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సేవలందిస్తూ అతిచిన్న వయసులోనే అందరి ప్రశంసలు అందుకుంటున్నారని కొనియాడారు.భవిష్యత్తులో ఆయన ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఇందులో భాగంగా శ్రీహరి నాయుడుని శాలువా,పూలమాలతో సత్కరించి అభినందించారు.ఆత్మీయ వాతావరణంలో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో బోయకొండ లడ్డు రమణ,కొండమర్రి నాగరాజు నాయుడు,కొండమర్రి గుణశేఖర్ నాయుడు,అలకం ప్రకాష్ నాయుడు,వనం నాగరాజు నాయుడు,కంబాల రాజశేఖర్ నాయుడు,జన్నే దామోదర్ నాయుడు,రమణ నాయుడు,ప్రవీణ్ రాయల్,ఆనంద్ రెడ్డి,వెంకట్ రెడ్డి,గానిగగడ్డ బుజ్జి నాయుడు,చిన్ని నాయుడు,రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన కుటుంబాలకు స్వదిష్ట ట్రస్ట్,ధాత్రి ఫౌండేషన్ బాసట

## - నెలకు సరిపడా సరుకులు వితరణ





మదనపల్లె (ప్రజా సీమ) : చిత్తూరు జిల్లా,పలమనేరు సమీపంలోని 30 మంది ట్రైబల్ మరియు ప్రత్యేక ప్రతిభావంతులకు స్వదిష్ట అన్న ప్రసాద ట్రస్ట్ మరియు ధాత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నెలసరి నిత్యావసర సరుకులను అందజేశారు. పలమనేరు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ట్రైబల్ వాసులు ప్రత్యేక ప్రతిభావంతులు 30 మంది నెలసరి సరుకులను తీసుకొని సంతోషాన్ని వ్యక్తపరిచారు.వేసవి కాలంలో మాకు ఎటువంటి ఆదరణ ఉండటం లేదని,వేసవి వచ్చిందంటే జీవనం సాగించడం కష్టతరమవుతోందని ఇంటిల్లిపాదికి కూలీ పనులు కూడా దొరకటం లేదని,ఈ నెలసరి సరుకులు రెండు నెలల పాటు సంతోషంగా ఇల్లు గడవడానికి ఉపయోగపడతాయని మమ్మల్ని గుర్తించి సుదూర ప్రాంతాల నుంచి తిరుపతి పట్టణం నుంచి స్వదిష్ట అన్న ప్రసాద ట్రస్ట్,మదనపల్లి నుంచి ధాత్రీ ఫౌండేషన్ వారు మా మండలంలో నిత్యావసర సరుకుల్ని మాకు అందజేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి పూర్ పీపుల్స్ సొసైటీ కార్యదర్శి రమేష్ మరియు వారి బృందం,ధాత్రి ఫౌండేషన్ మరియు స్వదిష్ఠ స్వచ్ఛంద సంస్థలు సేవే మార్గంగా పనిచేస్తున్న సంస్థలు అని,పలమనేరు మండలంలో ఎటువంటి సేవా కార్యక్రమాలు ఈ ఇరువురి సంస్థలు నిర్వహించిన మేము వాలంటరీ సర్వీస్ మా బృందం అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.ధాత్రీ ఫౌండేషన్ మరియు స్వదిష్ట స్వచ్ఛంద సంస్థల నిర్వహకులు అయినటువంటి డాక్టర్ స్వాతి చక్రపాణి,విజయలు మా సేవ అన్నది ఒక ఊరిలో ఒక గ్రామానికి పరిమితం కాకూడదని అవసరం,అత్యవసరమని రెండు విషయాలను దృష్టిలో పెట్టుకొని వేము సేవా మార్గంలో ముందు కెళ్తామన్నారు.అత్యవసరంగా ఉన్న పేద ప్రజల కోసం ఎంత దూరమైనా వెళ్లి ఈ రెండు స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలు మరింత విస్తృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# పర్యాటక కేంద్రం హార్శిలీహిల్స్ లో మహానాడు సమీక్షా సమావేశం

## - హాజరైన సుగవాసి ప్రసాద్ బాబు,పోలంరెడ్డి దినేష్ రెడ్డి





కురబలకోట (ప్రజా సీమ) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఇంధన పొదుపు పాటిస్తూ ఆదర్శంగా నిలవాలని సంకల్పించిన మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మహానాడు పండుగను ప్రతి నియోజకవర్గంలో క్లస్టర్ వారీగా డిజిటల్ పద్ధతిలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం ఎంతో అభినందనీయం.దేశ ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఒక ఆదర్శంగా నిలవాలని బాబు తీసుకున్న ఈ నిర్ణయానికి అనుగుణంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఈ నెల 27,28 తేదీలలో వర్చువల్‌గా నిర్వహించనున్న మహానాడు కార్యక్రమం విజయవంతం కోసం గురువారం హార్శిలీహిల్స్ కన్వెన్షన్ హాల్‌లో మండల అధ్యక్షులు,క్లస్టర్ ఇంచార్జీలు,యూనిట్,బూత్ ఇంచార్జీలు,అలాగే నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి క్లస్టర్‌లోని నాయకులు సమన్వయంతో పని చేసి మహానాడు కార్యక్రమాన్ని ఘనవిజయవంతం చేయాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు,స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ మరియు తంబళ్లపల్లె నియోజకవర్గం పరిశీలకులు పోలంరెడ్డి దినేష్ రెడ్డి,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ తమ మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా సురేంద్ర యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు పర్చువల్ విధానంలో తంబళ్లపల్లి నియోజకవర్గంలో నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశం శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు.మహానాడును తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలకు ఓ పండుగలా జరుపుకోవాలని కోరారు.

# జడ శ్రావణ్ ను కలిసిన మాల మహానాడు నాయకులు



ప్రొద్దుటూరు( ప్రజా సిమ ): మాల మహానాడు జి చెన్నయ్య వర్గం కడప జిల్లా అధ్యక్షులు,జ్యేష్ఠాది భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ నందు, జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు. కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు, మంచా సాయి, కడప జిల్లా ఉపాధ్యక్షులు బేరీ అహరోన్ లు రాష్ట్రంలో దళిత సామాజిక వర్గానికి ఏ కష్టం వచ్చినా ముందంజలో ఉండి దళిత సామాజిక పక్షాన పోరాడుతూ అండగా నిలుస్తున్న జడ శ్రావణ్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేయడం జరిగింది.

# 24న వేంపల్లెలో మెగా ఉచిత వైద్య శిబిరం

వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:స్థానిక గండిరోడ్డులోని డా.బాష ఆసుపత్రిలో ఈనెల 24వ తేది మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డా.ఎస్ఎఫ్ బాష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో వేంపల్లెలోని డాక్టర్ బాష హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24వ తేది ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కడప పట్టణానికి చెందిన క్యాన్సర్ వైద్య నిపుణులు డా.వంశీ విహారీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, షుగర్, బిపి, థైరాయిడ్, పక్షపాతం వ్యాధులకు సూచనలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచిత వైద్య శిబిరం నందు బిపి, షుగర్ వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వేంపల్లె పరిసర ప్రాంతాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత వైద్య శిబిరంకు వచ్చే ప్రజలు ముందుగా ఆసుపత్రిలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


# జర్నలిస్టుల హక్కుల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ అలుపెరుగని పోరాటం

## - జూన్ 7న పీలేరులో అన్నమయ్య జిల్లా తొలి మహాసభ



మదనపల్లె (ప్రజా సీమ) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని సంస్థ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ కవరకుంట్ల జయరాజ్ పేర్కొన్నారు.మదనపల్లె పట్టణంలోని ఎస్టీయూ భవన్ నందు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రమేష్ రాయల్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సమావేశం ప్రారంభానికి ముందు అమరులైన విలేకరులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాల కేటాయింపు,మీడియా కమిషన్ ఏర్పాటు,పెన్షన్ సౌకర్యం,జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు.మార్చి 4న నిర్వహించిన ఛలో విజయవాడ కార్యక్రమం జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.వేలాదిమంది జర్నలిస్టులు విజయవాడ వీధుల్లో తమ హక్కుల కోసం గళమెత్తారని తెలిపారు.ఆ కార్యక్రమానికి హాజరైన సమాచార శాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించారని,త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ఏపీడబ్ల్యూజేఎఫ్ ను సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు స్థానిక నాయకత్వం సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం జూన్ 7న పీలేరు పట్టణంలో అన్నమయ్య జిల్లా తొలి మహాసభ నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ఈ మహాసభకు మంత్రులు,శాసనసభ్యులు,ప్రతిపక్ష నాయకులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రమేష్ రాయల్,హిదాయతుల్లా (అప్పు),ఏపిబిజిఏ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి ప్రసాద్, రమేష్ బాబు,అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు జాకీర్,మంజునాథ్,నానబాల కుమార్,రాజు,శ్రీనివాసులు,కటారి రామయ్య,గిరి,గిరిశేఖర్,ఆంధ్రప్రభ శీను,అస్లాం,నజీర్ సాహెబ్,బాలాజీ,గురు ప్రసాద్,భానుకిరణ్,రవి తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో స్కాన్ సెంటర్లపై జిల్లా అధికారుల ఆకస్మిక తనిఖీలు





మే 21(గుడివాడ):గుడివాడలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో జిల్లా సర్వైలెన్స్ అధికారి డా. ఎ. సాయికిరణ్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యాధికారులతో కలిసి స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. సాయికిరణ్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, చేసినా, చెప్పినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ సమయంలో లింగ నిర్ధారణ చేయలేదని గర్భిణులతో రిజిస్టర్‌లో విధిగా సంతకం చేయించుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఫారం-ఫ్ తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. తహసీల్దార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవ వివరాలు పంపడంలో నిర్లక్ష్యం జరుగుతోందని, ప్రసవం జరిగిన వెంటనే వివరాలు రిజిస్టర్ చేసి పంపాలని సూచించారు. ఈ తనిఖీలలో పి.పి యూనిట్ డీడీవో డా. డి. శ్వేత, జనరల్ వైద్య నిపుణులు డా. కె. సాగర్, ఏరియా ఆసుపత్రి రేడియాలజిస్టు డా. టి. భరత్ కుమార్, యూపీహెచ్‌సీవో వి.రామారావు పాల్గొన్నారు.

# కడప గడపలో నారా లోకేష్ కు ఘనస్వాగతం

## -పార్టీ నాయకులతో సమీక్ష









కడప,(ప్రజా సీమ) కడప జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా కడప విమానాశ్రయమునకు గురువారం సాయంత్రం చేరుకున్న రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్,రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కి కడప గడపలో ఘన స్వాగతం లభించింది. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికై తొలిసారి కడప పర్యటనలో అడుగుపెట్టిన లోకేష్ కి అడుగడుగునా నాయకులు కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,ప్రభుత్వ విప్ మరియు కడప శాసన సభ్యురాలు మాధవి రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధిమీనా,రాజం పేట సబ్ కలెక్టర్ భావన, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్, డి సి సి బి బ్యాంక్ చైర్మన్ సూర్య నారాయణ,డి సి ఎం ఎస్ చైర్మన్ జయప్రకాష్,ఎ ఎఫ్ సి ఓ ఎఫ్ చైర్మన్ యాదగిరి రామ్ ప్రసాద్,షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్,ఆర్ డి ఓమురళీ,డి ఈ ఓ శంషుద్దీన్, సమగ్ర శిక్ష ఏపీసి అనురాధ, నాయకులు భూపేష్ రెడ్డి, హరిప్రసాద్,రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి,పుత్తా నరసింహా రెడ్డి, జగన్మోహన్ రాజు,బీటెక్ రవి,రితేష్ కుమార్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి, పుట్టాలక్ష్మి రెడ్డి,మున్నూర్ అలీ ఖాన్,అమీర్ బాబు,ప్రజా ప్రతినిధులు,అభిమానులు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కడప నగర శివారులోని రాజరాజేశ్వరి కళ్యాణ మండపం వద్ద జిల్లాలోని టిడిపి నాయకులతో పార్టీ క్యాడర్ తో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు కడప జిల్లాలో వ్యవహరించవలసిన పలు విషయాలపై చర్చించడంతోపాటు అనేక సూచనలు సలహాలు తీసుకొని నాయకులు కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. నాయకులు తెలిపిన పది సమస్యలను, వినతులను స్వీకరించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని, అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# దళితుల అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అన్యాయం

## - దళిత ప్రగతికి అడ్డుకట్ట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



జగ్గయ్యపేట: మే 21, : జగ్గయ్యపేట పట్టణంలోని ది కృష్ణ ఫార్మర్స్ అసోసియేషన్ బిల్డింగ్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల అభివృద్ధికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాల్సిన ప్రభుత్వం, జగన్ మోహన్ రెడ్డి పాలనలో దళిత సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దళితుల కోసం కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం, సబ్ ప్లాన్ నిధులను దుర్వినియోగం చేయడం, సంక్షేమ పథకాలను నిలిపివేయడం వల్ల దళిత వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో అమలైన దళిత డ్రైవర్ సబ్సిడీ, విదేశీ విద్య, స్వయం ఉపాధి వంటి పథకాలు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేయడంతో వేలాది మంది యువత అవకాశాలు కోల్పోయారని తెలిపారు. అలాగే దళితులపై దాడులు, వివక్ష ఘటనలు పెరిగినా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దళితులకు కేటాయించిన వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయాయని, దళిత యువత ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకం, దళిత కార్పొరేషన్ రుణాలు, భూముల పంపిణీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి అంటే దళితుల అభివృద్ధి కూడా సమానంగా ఉండాలని, దళితుల హక్కులు, ఆత్మగౌరవం కాపాడే విధానాలు అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, వడ్లమూడి రాంబాబు, కట్టా వెంకట నరసింహారావు, అలాగే నాయకులు యానాల గోపీచంద్, మైనేని రాధాకృష్ణ, కొఠారు సత్యనారాయణ ప్రసాద్, జిల్లేపల్లి సుధీర్ బాబు, దూళిపాల లక్ష్మణరావు, మల్లెల కొండయ్య, తాళ్లూరు వెంకటేశ్వర్లు, అడుసుమిల్లి ప్రభాకర్, గుమ్మ వెంకటేష్, అయిలపోగు వెంకటేశ్వర్లు, కసుకుర్తి శ్రీనివాసరావు, చావా నాగేశ్వరరావు, పల్లెబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు విజయ కుమార్ మృతి

నవజనత, మే 21, ముదినేపల్లి : ముదినేపల్లి మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు వనాబత్తిన విజయ కుమార్ (63) వడదెబ్బకు గురై గురువారం మృతి చెందారు. గత మూడు దశాబ్దాలుగా ప్రముఖ దినపత్రికల్లో విలేఖరిగా పనిచేసి ప్రస్తుతం విశాలాంధ్ర దినపత్రిక విలేకరిగా కొనసాగుతున్నారు. వడదెబ్బకు గురైన విజయ కుమార్ ను గుడివాడ ఆసుపత్రికి తరలిస్తుడంగా మార్గం మధ్యలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విజయ కుమార్ అంతిమయాత్ర ముదినేపల్లిలోని అంబేద్కర్ నగర్ లోని స్వగృహం నుంచి శుక్రవారం ఉదయం జరుగుతుందని చెప్పారు.

# కోనేటి కాల్వ వీధిలో యువకుడిపై ఇద్దరు వ్యక్తులు దాడి



ప్రొద్దుటూరు,( ప్రజా సీమ) స్థానిక కోనేటి కాల్వ వీధికి చెందిన షేక్ అఫ్జల్ అనే యువకుడిపై అదే వీధికి చెందిన యూసుఫ్ మరియు హుస్సేన్ అనబడే వ్యక్తులు సిమెంటు ఇటుకలతో తలపై కొట్టడం వలన రక్త గాయాలు అయినట్లు ప్రొద్దుటూరు వన్ టౌన్ ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అఫ్జల్ పిన్ని కుమారుడిని యూసఫ్ అనే వ్యక్తి తన ఇంటి వద్ద చిన్న పని ఉందని బలవంతంగా పిలుచుకొని వెళ్లాడని, అఫ్జల్ యొక్క కుటుంబ సభ్యులు ఆ పిల్లవాడి ఆచూకీ కోసం వెతకగా యూసుఫ్ తీసుకుని వెళ్ళాడని తెలిసి అతన్ని ఎందుకు పిల్లవాణ్ణి పిలుచుకెళ్ళావని అడిగినందుకు యూసుఫ్, అతని సోదరుడు హుస్సేన్ ఇద్దరు దాడి చేసి అఫ్జల్ ను గాయపరిచారని వివరించారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి ఆ ఇద్దరు దాడి చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని తెలిపారు.

# పండుగ వాతావరణంలో చల్లా రెడ్డి లక్షిత జన్మదిన వేడుకలు

## - చిన్నారిని ఆశీర్వదించిన ఏఎస్పి వెంకటాద్రి,ప్రముఖులు





మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణం,సొసైటీ కాలనీ నందు గల శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా అజయ్ కుమార్,బిందుల గారాలపట్టి చల్లా రెడ్డి లక్షిత పుట్టినరోజు వేడుకలు బుధవారం రాత్రి ఓ ఫంక్షన్ హాల్ నందు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి,ఇతర ప్రముఖులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏఎస్పి వెంకటాద్రి మాట్లాడుతూ శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ సంస్థను స్థాపించి వినూత్నమైన కంప్యూటర్ కోర్సులపై విద్యార్థిని,విద్యా ర్థులకు, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంతో,సేవా కార్యక్రమాల్లో అజయ్ కుమార్ ముందువరుసలో నిలుస్తున్నారని కొనియాడారు. ఆయన కుమార్తె రెడ్డి లక్షిత ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుకున్నారు. ఈ పుట్టినరోజు వేడుకలకు పలువురు ప్రముఖులు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం అందరికీ రుచికరమైన శాఖాహార విందు భోజనం వడ్డించారు. తన కుమార్తె పుట్టినరోజు వేడుకలకు విచ్చేసి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి అజయ్ కుమార్,బిందుల దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్నేరు కరకట్ట మరమ్మత్తు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



జగ్గయ్యపేట: వే 21 : జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి మండలం, పోలంపల్లి గ్రామంలో 2024లో వచ్చిన వరదల కారణంగా దెబ్బతిన్న మున్నేరు కరకట్ట మరమ్మత్తు పనులను శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రైతు సంఘం నాయకులు మరియు స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్నేరు కరకట్ట దెబ్బతినడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రైతుల పంటలు మరియు గ్రామ ప్రజల భద్రత దృష్ట్యా కరకట్ట మరమ్మత్తు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి మరియు రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, మున్నేరు డ్యామ్ చైర్మన్ పొన్నం బాలాజీ, మన్నె భాస్కరరావు, పెంటేల శ్రీనివాసరావు, వంకాయలపాటి బ్రహ్మం ,శ్రీను, దారెల్లి చిరంజీవి, మాడుగుల సురేష్ మరియు రైతు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన ఏ పీ ఎం ఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీ రామ్ యాదవ్





తిరువూరు, మే 21 : ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏ పీ ఎం పి ఏ) కుటుంబ సభ్యుడు చి. మడిపల్లి రాంబాబు,చి.ల. సౌ. అలేఖ్య ల వివాహ శుభకార్యానికి ఏ.పీ.ఎం.పి.ఏ. రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి,అభినందనలు తెలిపారు. గురువారం జి.కొత్తూరు గ్రామంలో జరిగిన రాంబాబు, అలేఖ్య ల వివాహ వేడుకలో ఏ.పి.ఎం.పి.ఏ.రాష్ట్ర సెక్రెటరీ పసుపులేటి చైతన్య, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు మరకాల గోపి మరియు రెడ్డి, తిరువూరు అధ్యక్షుడు నాగుల మీరా మరియు సీనియర్ జర్నలిస్ట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.

# ఆరోగ్యం



## మీ మూత్రం ఏ రంగులో ఉందో గమనించారా?..

## ఈ రంగుల్లో ఉంటే మాత్రం కచ్చితంగా రోగం ఉన్నట్లే!

మన శరీరంలో ఏదైనా సమస్య ఉంటే మూత్ర పరీక్ష ద్వారా తెలుసుకుంటాం కదా. అయితే పరీక్ష లేకుండానే మన మూత్రం రంగును బట్టి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవచ్చు. మూత్రం సాధారణంగా కాకుండా వేరే రంగులో ఉంటే కచ్చితంగా మనం ఎదో సమస్యలో ఉన్నామని అర్థం చేసుకోవాలి. మూత్రం ఏ రంగులో ఉంటే ఎలాంటి సమస్యలు వస్తాయనేది ఈ స్టోరీ ద్వారా తెలుసుకోండి.

ఎరుపు లేదా పింక్ కలర్

మూత్రం ఎరుపు లేదా గులాబీ రంగులో ఉంటే కిడ్నీ పాడైందని అర్థం. పింక్ యూరిన్ చూసిన వెంటనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మూత్రం సాధారణంగా అదే కలర్‌లో కనిపిస్తుంటుంది. ఏదైనా ఆహారం తిన్నా, లేదా మందులు వేసుకున్నా మూత్రం పింక్ కలర్‌లో మారుతుంటుంది. అందుకే మీ మూత్రం పింక్ కలర్‌లో కనిపించగానే మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు. ఒకవేళ మీరు ఎలాంటి ఆహారం తీసుకోకపోయినా, మీ మూత్రం అదే రంగులో కనిపిస్తే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించండి.

మూత్రం గోధుమ రంగులో ఉంటే.. మీ మూత్రం గోధుమ రంగులో ఉంటే, మీరు డీహైడ్రేషన్‌లో ఉన్నారని లేదా మీకు కాలేయం, మూత్రపిండాలకు సంబంధించిన ఆరోగ్య సమస్య ఉందని అర్థం. కాబట్టి మూత్రం రంగు పసుపు రంగులో ఉన్నట్లయితే, మీ మూత్ర పిండాలు, కాలేయంపై శ్రద్ధ వహించాలి. మద్యం సేవించడం వంటివి చేయకూడదు. ప్రమాదం మరింతగా ముదిరినట్లు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

పసుపు రంగులో ఉంటే.. మూత్రం పసుపు రంగులో ఉంటే కామెర్లు ఉందని అర్థం. కాకపోతే శరీరంలో నీటి శాతం తక్కువగా ఉన్నా కూడా మూత్రం పసుపు రంగులో వస్తుంటుంది. ఒకవేళ మీరు పుష్టిగా నీరు తాగుతున్నా మూత్రం పసుపు రంగులో కనిపిస్తే మాత్రం కచ్చితంగా కామెర్లకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, వైద్యులను సంప్రదించి దానికి తగిన చికిత్స చేయించుకోవాలి. అలాగే మీ మూత్రం నారింజ లేదా ఆకుపచ్చ లేదా పసుపు రంగులో ఉంటే, కాలేయ ఆరోగ్య పరీక్ష చేయించుకోవడం మంచిది.

మూత్రం చాలా నురుగుగా ఉంటే

మూత్రంలో ప్రొటీన్ ఎక్కువగా వెళితే, మూత్రం నురుగుగా ఉంటుంది. మీరు మూత్ర విసర్జనకు వెళ్ళిన ప్రతిసారీ మీ మూత్రం నురుగుగా ఉంటే, మీకు కిడ్నీ లేదా మూత్రాశయ సమస్య ఉందని అర్థం. కాబట్టి మీరు దీన్ని కనుగొంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి. మూత్రం నలుపు రంగులో ఉంటే.. మీరు విసర్జించే మూత్రం నలుపు రంగులో ఉంటే.. మీ శరీరంలో రసాయనం ఉందని అర్థం. మీరు దీన్ని కనుగొంటే, ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. రంగు లేకపోతే? మూత్రంలో రంగు లేకపోతే మనం ఆరోగ్యంగా ఉన్నామని కాదు. మూత్రం ఏ రంగులో లేకపోతే మీకు మధుమేహం ఉందని అర్థం. మూత్రం రంగు తేలికగా ఉన్నా, తరచుగా మూత్ర విసర్జనకు వెళ్తున్నా మీకు మధుమేహం ఉందని అర్థం చేసుకోవాలి.

## అన్నంతో టమాటో పులావ్.






**టమాటో పులావ్ తయారీకి కావాల్సిన పదార్థాలు** -టమాటో -లవంగాలు -యాలకలు -షాజీరా -ఉల్లిపాయ -ఆయిల్ -నెయ్యి -ఉప్పు -కారం -గరం మసాలా -ధనియాల పొడి -బాస్మతి రైస్ లేదా మిగిలిపోయిన అన్నం

టమాటో పులావ్ తయారీ విధానం -ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి 2 టేబుల్ స్పూన్ల నెయ్యి, 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ పోసి వేడి చేయండి. -ఆయిల్ కొంచెం వేడెక్కిన తర్వాత అందులో ఒక ఇంచు దాల్చిన చెక్క, 2 లవంగాలు, 2 యాలకలు, అర టీస్పూన్ షాజీరా, ఒక ఉల్లిపాయ చీలికలు వేసి బంగారు గోధుమ రంగె వచ్చే వరకు వేపుకోండి. -తర్వాత అందులో 1 టీస్పూన్ అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి కలిపిన తర్వాత రెండు పెద్ద టమాటోల గుజ్జు వేయాలి. ఇందుకోసం టమాటోలను మిక్సీలో వేసి మెత్తని గుజ్జులా చేసుకోండి. దానిని పాన్ లో వేయాలి. -తర్వాత అందులో అర చెంచా ధనియాల పొడి, అర చెంచా గరం మసాలా,1 టీస్పూన్ కారం,రుచికి తగినంత ఉప్పు వేసి మొత్తం కలిసేలా కలిపి పచ్చి వాసన పోయి ఆయిల్ పైకి తేలేంతవరకు వేయించుకోండి. తర్వాత అందులో 3 టమాటోల ముక్కలు వేసి పచ్చి వాసన పోయేంతవరకు మగ్గించుకోండి. -తర్వాత కొద్దిసేపు నానబెట్టి వండిన బాస్మతి బియ్యం 1 కప్పు ఇందులో వేసి బాగా కలుపుకోండి. ఇంట్లో మిగిలిపోయిన అన్నం కూడా వేసుకోవచ్చు. రైస్ వేసి కలిపిన తర్వాత దాని మీద కొంచెం కొత్తిమీర చల్లుకొని స్టవ్ ఆఫ్ చేస్తే టేస్టీ టమాటో పులావ్ రెడీ.

## హైదరాబాదీ వెజ్ దమ్ బిర్యానీ..



**బిర్యానీ అంటే హైదరాబాద్..హైదరాబాద్ అంటే బిర్యానీ పేరు గుర్తుకువస్తది. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లి బిర్యానీ తిన్నా హైదరాబాద్ బిర్యానీ టేస్ట్ రాదు. అందుకే ఈ భూమ్మీద బిర్యానీ అత్యంత టేస్టీగా ఉండేది ఎక్కడ అంటే హైదరాబాద్ అని చెప్పేస్తారు ఏ దేశంలో అయినా. అంత ఫేమస్ మన బిర్యానీ. అయితే హైదరాబాద్ దమ్ బిర్యానీ రెస్టారెంట్లలో వచ్చే టేస్ట్ మాదిరి ఇంట్లో కూడా రెడీ చేసుకోవచ్చు. హైదరాబాద్ స్పెషల్ వెజ్ దమ్ బిర్యానీ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.**

హైదరాబాద్ స్పెషల్ వెజ్ దమ్ బిర్యానీ తయారీకి కావాల్సినవి -బాస్మతి బియ్యం -క్యారెట్ -బీన్స్ -బంగాళదుంప -పచ్చిమిర్చి -నెయ్యి -పచ్చి బఠానీ -ఫ్రైడ్ ఆనియన్ -పచ్చిమిర్చి చీలికలు.

-దాల్చిన చెక్క -యాలకలు -షాజీరా -బిర్యానీ ఆకు -లవంగాలు -అల్లం వెల్లుల్లి పేస్ట్ -కొత్తిమీర -పుదీనా -కారం -పసుపు -ఉప్పు -ధనియాల పొడి -వేయించిన జీలకర్ర పొడి -గరం మసాలా -నిమ్మకారర రసం -పెరుగు -పచ్చి బఠానీ -కుంకుమ పువ్వు -వేడిపాలు -అనాస పువ్వు

హైదరాబాద్ స్పెషల్ వెజ్ దమ్ బిర్యానీ తయారీ విధానం -ముందుగా ఒకటిన్నర కప్పు అంటే 325 గ్రాముల బాస్మతి బియ్యంని గంట పాటు నానబెట్టుకోండి. -తర్వాత స్టవ్ ఆన్ చేసి బాండీ పెట్టి అందులో నీళ్లు పోసి బాగా మరిగించాలి. -మరుగుతున్న నీళ్లల్లో చెక్కు తీసిన 1 బంగాళదుంప ముక్కలు,6 ఫ్రెంచ్ బీన్స్, 1 క్యారెట్ ముక్కలు, క్యాలీఫ్లవర్ ముక్కలు కొన్ని, చిటికెడు పసుపు,కొంచెం ఉప్పు వేసి ఉడికించండి. -70 శాతం వరకు ఉడికిన తర్వాత అంటే 5 నిమిషాల్లో పూర్తిగా ఉడుకుతాయి అనుకున్నప్పుడు వీటన్నింటిని బాండీలోనుంచి ఓ బౌల్ లోకి తీసుకొని వాటిమీద కొన్ని చన్నీళ్లు పోసి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు అడుగు మందంగా ఉండే గిన్నెలో ఈ ఉడికించినవన్నీ వేసేయండి. ఇందులోనే అరగంట పాటు వేడి నీటిలో నానబెట్టిన పిడికెడు పచ్చి బఠానీ, పావు కప్పు ఫ్రైడ్ ఆనియన్,2 పచ్చిమిర్చి చీలికలు, 1 ఇంచు దాల్చిన చెక్క,5 యాలకలు, 1 టీస్పూన్ షాజీరా,1 బిర్యానీ ఆకు,4 లవంగాలు, 1 టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, 2 టేబుల్ స్పూన్ల కొత్తిమీర, 2 టేబుల్ స్పూన్ల పుదీనా,1 టేబుల్ స్పూన్ కారం, పావు చెంచా పసుపు,తగినంత ఉప్పు,1 టీస్పూన్ ధనియాల పొడి, 1 టీస్పూన్ వేయించిన జీలకర్ర పొడి, అర టీస్పూన్ గరం మసాలా,నిమ్మకారర రసం కొంచెం వేసి అన్నీ కలిసేటట్లు బాగా కలపండి. -తర్వాత అందులోనే అరకప్పు మీగడతో ఉన్న పెరుగు వేసి కలిపి 2 టేబుల్ స్పూన్ల నెయ్యి, 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ వేసి కలిపి గిన్నెను పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు మరో పెద్ద గిన్నెను స్టవ్ మీద పెట్టి అందులో 2 లీటర్ల నీళ్లు పోసి అవి కొంచెం వేడయ్యాక అందులో 6 లవంగాలు, 6 దంచిన యాలకలు, 1 నల్ల యాలక, 1 టీస్పూన్ షాజీరా,1 బిర్యానీ ఆకు,1 అనాస పువ్వు,2 టేబుల్ స్పూన్ల అల్లంవెల్లుల్లి పేస్ట్,ఇందులో ఉండే ఉప్పే రైస్ కి పడుతుంది కాబట్టి సరిపడా ఉప్పు వేసి నీరుని తెర్లకాగనివ్వండి.

నీళ్లు తెర్లకాగుతున్నప్పుడు అందులో గంటపాటు నానబెట్టిన బాస్మతి బియ్యం వేసి ఇందులోనే 1 పచ్చిమిర్చి చీలిక, అర చెక్క నిమ్మరసం పిండుకోండి. -70 శాతం వరకు అంటే పట్టుకుంటే సగంపైన ఉడికి ఇంకా కొంచెం పలుకు ఉండేట్లు ఉన్నప్పుడు రైస్ ని కొద్ది తీసి మసాలలన్నీ కలిపి ఉంచిన వెజిటేబుల్స్ మీద రెండు లేయర్స్ గా వేసుకోండి. తర్వాత 80 శాతం వరకు ఉడికిన రైస్ ని మరో లేయర్ గా, 90 శాతం ఉడికిన రైస్ ని మరో లేయర్ గా వేజిటేబుల్స్ మీద వేసుకోవాలి. -ఇప్పుడు బిర్యానీ గిన్నె స్టవ్ మీద పెట్టి అందులో అంచుల వెంట రైస్ ఉడికించుకున్న నీళ్లు కొద్దిగా, 2 టేబుల్ స్పూన్ల నెయ్యి,వేడి పాలల్లో చిటికెడు నానబెట్టిన కుంకుమ పువ్వు,పవు చెంచా గరం మసాలా,2 టేబుల్ స్పూన్ వేయించిన ఆనియన్,1 టీస్పూన్ కొత్తిమీర చల్లి మూతపెట్టేసి 15 నిమిషాలు లో ఫ్లేమ్ మీద ఉడికించుకోండి. తర్వాత స్టవ్ ఆపేసి మరో 15 నిమిషాలు వదిలేసేయండి. -ఇంతే హైదరాబాదీ స్పెషల్ వెజ్ దమ్ బిర్యానీ రెడీ.



## చికెన్ టిక్కా ఇంట్లోనే..

**చికెన్ టిక్కా తయారీకి కావాల్సిన పదార్థాలు :** బోన్‌లెస్ చికెన్ పెరుగు కారం ఉప్పు పసుపు అల్లం వెల్లుల్లి పేస్ట్ గరం మసాలా నిమ్మరసం ధనియాల పొడి కసూరి మేథీ బిర్యానీ మసాలా మిరియాల పొడి శనగ పిండి నూనె చికెన్ టిక్కా తయారీ విధానం ఈ చికెన్ టిక్కాను ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. మ్యారినేట్ సరిగ్గా చేసుకుంటే ఇంట్లో చేసుకునే చికెన్ టిక్కా హెూటల్‌లో వాటికంటే మరింత రుచికరంగా ఉంటుంది. అలా చేసుకోవడానికి ముందుగా.. చికెన్‌ను శుభ్రంగా కడుక్కొని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో ఇప్పుడు పెరుగు, కారం, ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, నిమ్మరసం, ధనియాల పొడి, కసూరి మేథీ, శనగ పిండి, మిరియాల పొడి, బిర్యానీ మసాలా వేసుకోవాలి. ఇప్పుడు మనం వేసుకున్న మసాలాలు అన్నీ ఆ చికెన్‌కు పట్టుకునే విధంగా బాగా కలుపుకోవాలి. ఆ మసాలాలు మొత్తం చికెన్‌కు పట్టుకోవడానికి ఒక గంట పాటు మ్యారినేట్ చేసుకున్న చికెన్‌ను పక్కన పెట్టుకోవాలి. సాధారణంగా ఈ చికెన్ టిక్కాను కట్టెల పొయ్యి మీద చేసుకుంటేనే రుచి అద్భుతంగా ఉంటుంది. వీలైతే కట్టెల పొయ్యి మీదే చేసుకోవడానికి ప్రయత్నించండి. లేని యెడల గ్యాస్‌పైన కూడా చేసుకోవచ్చు. అలా ఒక గంట పాటు మ్యారినేట్ అయిన చికెన్‌ను తీసుకొని ఇనుప చువ్వల్లో గుచ్చుకోవాలి. ఆ తరువాత బొగ్గుల మంట మీద ఆ చికెన్ ముక్కలను రెండు వైపులా బాగా కాలే విధంగా నూనె పూసుకుంటూ కాల్చుకోవాలి. రెండు వైపులా సరిగ్గా కాలే వారకు కాల్చుకోవాలి. అప్పుడే ముక్క బాగా ఉడుకుతుంది. రుచి అద్భుతంగా ఉంటుంది.

ప్రజాసీమ
PRGI Regd. No : APTEL/26/A0819
జాతీయ తెలుగు దినపత్రిక


# సినిమా న్యూస్





## గోల్డ్ టాసెల్ గౌన్‌లో మెరిసిన రాశీ ఖన్నా!

తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న రాశీ ఖన్నా, సినిమాలతోనే కాకుండా ఓటీటీ ప్రపంచంలోనూ తన మార్క్ చూపిస్తోంది. గతంలో షాహిద్ కపూర్‌తో చేసిన 'ఫర్జీ' సిరీస్‌తో సూపర్ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు సరికొత్త యాక్షన్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా ఆమె నటించిన మోస్ట్ అవేటెడ్ క్రైమ్–థ్రిల్లర్ మ్యూజికల్ సిరీస్ 'లుక్కే' ప్రమోషన్స్‌లో రాశీ ఖన్నా ధరించిన గోల్డ్ టాసెల్ గౌన్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది..ఆ విశేషాలు చూద్దాం.. వెండితెరపై కమర్షియల్ సినిమాలతో పాటు మంచి పెర్ఫార్మెన్స్ ఉన్న రోల్స్ చేస్తూ రెండిటినీ బ్యాలెన్స్ చేసింది రాశీ ఖన్నా. అయితే డిజిటల్ స్క్రీన్‌పై కూడా ఆమె ట్రాక్ రికార్డ్ చాలా బాగుంది. 'ఫర్జీ' సక్సెస్ తర్వాత ఆమె డిమాండ్ ఓటీటీలో బాగా పెరిగింది. ఇప్పుడు మరోసారి అమెజాన్ ప్రైమ్ వీడియో ఒరిజినల్ సిరీస్ 'లుక్కే'తో డిజిటల్ ఆడియన్స్‌ను పలకరించింది.

ఈ సరికొత్త వెబ్ సిరీస్ 'లుక్కే'లో రాశీ ఖన్నా ఒక పవర్‌ఫుల్ పంజాబీ పోలీస్ ఆఫీసర్ 'ఇన్‌స్పెక్టర్ గుర్బానీ' పాత్రలో కనిపించనుంది. ఇక ఎప్పుడూ గ్లామరస్‌గా కనిపించే రాశీ, ఈ సిరీస్‌లో మాత్రం ఫుల్ యాక్షన్ మోడ్‌లో అదరగొట్టింది. డ్రగ్ మాఫియాను అంతం చేసే ఒక ఇంటెన్స్ రోల్‌లో ఆమె నటనకు మంచి మార్కులు పడుతున్నాయి.

హిమాంక్ గౌర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ 8 ఎపిసోడ్ల సిరీస్ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో మే 8 నుంచి సక్సెస్‌ఫుల్‌గా స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో రాశీ ఖన్నాతో పాటు ప్రముఖ రేపర్ కింగ్ , పాలక్ తివారీ, లక్వీర్ సింగ్ సరన్, శివాంకిత్ పరిహార్ కీలక పాత్రలు పోషించారు. రాప్ మ్యూజిక్, క్రైమ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ థ్రిల్లర్ సిరీస్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది.సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా రాశీ ఖన్నా చేసిన ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నె ట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. స్టేజ్ పెర్ఫార్మెన్స్‌లకు తగ్గట్టుగా డిజైన్ చేసిన లగ్జరీ గోల్డ్ అంబ్రే నెట్ బాడీకాన్ గౌన్‌లో రాశీ మెరిసిపోయింది. ఇక ఈ కా స్ట్యూమ్‌కు ఉన్న పూసల లేయర్స్, ఓంబ్రే–టోన్డ్ టాసెల్స్ ఆమె అందాన్ని మరింత పెంచేశాయి. ఈ లుక్‌ను చూసిన అమెజాన్ ప్రైమ్ అఫీషియల్ సోషల్ మీడియా హ్యాండిల్ "హియర్స్ ఏ స్టన్నర్ టు క్లెన్స్ యువర్ ఫీడ్" అంటూ రాశీ ఫొటోలను షేర్ చేసింది. ఒకవైపు సిరీస్‌లో రఫ్‌గా ఉండే పోలీస్ పాత్రలో కనిపిస్తూనే.. బయట ప్రమోషన్స్‌లో మాత్రం ఇలాంటి అదిరిపోయే గ్లామరస్ ఫోటోషూట్స్‌తో 'లుక్కే' సిరీస్‌కు రాశీ ఖన్నా గట్టి హైప్ తీసుకొచ్చింది. క్యూట్ లుక్స్‌తో కెరీర్ స్టార్ట్ చేసిన రాశీ.. ఇప్పుడు ఇలాంటి ఇంటెన్స్ రోల్స్ చేస్తూ ఓటీటీ క్వీన్‌గా దూసుకుపోవడం నిజంగా గ్రేట్ అంటున్నారు ఫాన్స్.

## పెద్ది అసలు హైలైట్ చెప్పిన చరణ్!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ మల్టీ స్పోర్ట్స్ డ్రామా పెద్దిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గ్రామీణ బ్యాక్‌డ్రాప్, స్పోర్ట్స్ ఎలిమెంట్స్, ఎమోషనల్ స్టోరీలైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఫ్యాన్స్ లో ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. ముఖ్యంగా రీసెంట్ గా రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్, చరణ్ లుక్, మాస్ టోన్ సినిమాకు మరింత హైప్ తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా రామ్ చరణ్ చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో కొత్త చర్చకు దారి తీశాయి. డైరెక్టర్ బుచ్చిబాబుతో కలిసి స్పెషల్ డ్రైవ్ ఇంటర్వ్యూలో పాల్గొన్న చరణ్, పెద్ది సినిమాలో తనకు అత్యంత ఇష్టమైన భాగం ఢిల్లీ ఎపిసోడ్ అని చెప్పడం అభిమానుల్లో క్యూరియాసిటీని పెంచేసింది. ఆ ఎపిసోడ్ నుంచే నుంచే సినిమా నెక్స్ట్ లెవెల్‌కు వెళ్తుందని, అదే అసలు మెయిన్ పాయింట్ అని చరణ్ చెప్పడంతో ఫ్యాన్స్ తెగ ఎగ్జైట్ అయిపోతున్నారు. సాధారణంగా స్టార్ హీరోలు సినిమాపై హైప్ పెంచేలా కామెంట్స్ చేయడం కొత్తేమీ కాదు. కానీ చరణ్ ఈసారి ప్రత్యేకంగా ఒక ఎపిసోడ్‌ను మాత్రమే హైలైట్ చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమైంది.

ఇప్పటికే పెద్దిలో ఢిల్లీ ట్రాక్‌కు భారీ స్థాయి ఎమోషనల్ వెయిట్ ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పుడదే ట్రాక్ తన ఫేవరెట్ అని చరణ్ చెప్పడంతో అది సినిమాకు అసలు టర్నింగ్ పాయింట్ అయి ఉండొచ్చనే అంచనాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా ఇంటర్వెల్ తర్వాత కథ పూర్తిగా మారిపోతుందని, ఆ ఎపిసోడ్ హీరో జీవితాన్ని మార్చేస్తుందని ఊహాగానాలు ఆల్రెడీ సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి. మరో ఇంట్రెస్టింగ్ అంశం ఏంటంటే పెద్దిని ఇప్పటివరకు చాలా మంది కేవలం స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ఉన్న మాస్ సినిమా గానే భావించారు. కానీ చరణ్ కామెంట్స్ తర్వాత ఇది ఒక భారీ ఎమోషనల్ జర్నీ కూడా అవుతుందనే అభిప్రాయం బలపడుతోంది. ఒకవైపు గ్రామీణ నేపథ్యంలో సాగిన కథ అకస్మాత్తుగా ఢిల్లీకి షిఫ్ట్ అవ్వడం కూడా సినిమాకు పాన్ ఇండియా ఫీల్ తీసుకురావచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఇప్పటికే మంచి హైప్ ఉన్న ఢిల్లీ ట్రాక్‌పై రామ్ చరణ్ చేసిన తాజా కామెంట్స్ సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్లాయి.

## విదేశాలలో రైడ్ చేస్తూ సెగలు పుట్టిస్తున్న కృతి సనన్!



ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ ప్రస్తుతం తన సినిమా షూటింగ్లో బిజీగా గడుపుతూనే మరొకవైపు అక్కడి అందాలను తిలకిస్తూ ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంటుంది . అందులో భాగంగానే తాజాగా ఈమె నటిస్తున్న చిత్రం కాక్ టెయిల్ 2..2012లో వచ్చిన కాక్ టెయిల్ చిత్రానికి సీక్వెల్ గా వస్తున్న ఈ సినిమాలో షాహిద్ కపూర్ హీరోగా నటిస్తూ ఉండగా.. ప్రముఖ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న మరో హీరోయిన్గా నటిస్తోంది. హోమీ అదజానియా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఇటలీ లోని సిసిలీ ప్రాంతంలో జరుగుతోంది.

ఈ నేపథ్యంలోనే అక్కడి ప్రదేశాలను ఆస్వాదిస్తూ.. జీప్ లో ఎండలో సేద తీరుతున్నట్లు అక్కడి ఫోటోలను వీడియోలను అభిమానులతో పంచుకుంది. ముఖ్యంగా మల్టీకలర్ బికినీతో పాటు ఐవరీ ఫ్రింజ్ షార్ట్స్ ధరించిన ఈమె .. తన గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. మొత్తానికైతే ఒకవైపు సినిమా షూటింగ్లో బిజీగా ఉ ంటూనే.. మరొకవైపు కాస్త సమయం దొరికితే చాలు అక్కడ ఇటలీ వీధుల్లో కూడా విహరిస్తూ ఆ ఫోటోలను ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసింది. ఏది ఏమైనా కృతి సనన్ రెండు వైపులా అన్నింటిని బ్యాలెన్స్ చేస్తూ మరింత సంతోషంగా కనిపిస్తోందని ఈ ఫోటోలు చూసిన నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.

1990 జూలై 27న ఢిల్లీలో జన్మించిన ఈమె.. మోడల్గా తన కెరీర్ను ప్రారంభించింది . ముఖ్యంగా కమర్షియల్ యాడ్స్ లో కనిపించి బాలీవుడ్లో భారీ పాపులారిటీ అందుకున్న కృతి.. తొలిసారి సుకుమార్ దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా వచ్చిన వన్ నేనొక్కడినే సినిమాతో అరంగేట్రం చేసింది. హిందీలో జాకీ ష్రాఫ్ తనయుడు టైగర్ ష్రాఫ్ సరసన హీరో పంతి సినిమాతో హిందీ రంగ ప్రవేశం చేసింది ఈ ముద్దుగుమ్మ. ఇక తర్వాత ప్రభాస్ హీరోగా నటించిన ఆది పురుష్ హిందీ చిత్రంలో సీతగా నటించింది కానీ ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోలేకపోయింది.

ఇకపోతే 2021 లో వచ్చిన మిమీ అనే సినిమాతో ఉత్తమ నటిగా ఫిలింఫేర్ అవార్డు , జాతీయ చలన చిత్ర అవార్డు అందుకున్న ఈమె.. 2019లో ఫోర్బ్స్ ఇండియా సెలబ్రిటీ 100 జాబితాలో పేరు దక్కించుకొని అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇక ప్రస్తుతం హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కృతి సనన్ గత ఏడాది ధనుష్ హీరోగా నటించిన తేరే ఇష్క్ మే అనే చిత్రంలో నటించింది. ఈ చిత్రాన్ని తెలుగులో అమర కావ్యం పేరిట రిలీజ్ చేశారు. ఇక ప్రస్తుతం కాక్ టెయిల్ 2 సినిమా షూటింగ్లో బిజీగా ఉంది. అలాగే అభిమానులను అలరించడానికి నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలను పంచుకుంటున్న విషయం తెలిసిందే.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma